క్లుప్తంగా

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి



వేడుకల్లో మాట్లాడుతున్న ఎంఈవో 2

బల్లికురవ: విభిన్న ప్రతిభావంతుల్లో మంచి తెలివితేటలు ఉంటాయని ప్రతిభను ప్రోత్సహించి ప్రతి ఒక్కరి అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని ఎంఈవో–2 కే రమేష్‌బాబు కోరారు. గురువారం వైదనలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని చెప్పారు. అనంతరం వారికి ఆటలు, డాన్స్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్, హెచ్‌ఎంలు మాధవి, జాన్, గ్రామ పెద్దలు గాలం ప్రభాకరరెడ్డి, ఎంవీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ హరిహరరెడ్డి, ఐఈఆర్‌పీసీ నాగబాబు, వెంకటేశ్వర్లు, నాజిని తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలతో ప్రమాదాలకు చెక్



భద్రతా వారోత్సవాల్లో మాట్లాడుతున్న అధికారులు

బల్లికురవ: గ్రానైట్ క్వారీలో నిబంధనలతో పాటు భద్రతా చర్యలు పాటిస్తే ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని భద్రతా కమిటీ టీం కె. శివశంకరరెడ్డి, రామకృష్ణ, నాగావలి, వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఈర్లకొండ లక్ష్మీ, ఎంవీఆర్, హనుమాన్, శ్రీనివాస సామ్రాజ్యం, వీకె గ్రానైట్ క్వారీల్లో భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. భద్రతకు సంబంధించి జెండాల ఆవిష్కరణ, క్వారీ మ్యాప్ హద్దులు, రికార్డులు, వసతుల భద్రతా చర్యలను టీమ్ పరిశీలించారు. క్వారీ మేనేజర్, మేట్ అందుబాటుతో అందరిని అప్రమత్తతోనే కార్మికుల చేత పనులు చేయించాలన్నారు. కార్మికులకు విధులు–బాధ్యతలపై ఆరు నెలలకొకసారి ఒకేషనల్ శిక్షణ ఇప్పించాలన్నారు. విధుల్లో అప్రమత్తతతోనే సురక్షితంగా ఇంటికి వెళ్తామని కార్మికుల చేత ప్రతిజ్ఞ చేయించారు. క్వారీ యజమానులు, మేనేజర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



రక్త పరీక్షలు చేయించుకుంటున్న ఈఓపీఆర్డీ రమేష్‌బాబు

కారంచేడు: సాధారణంగా వాతావరణంలో వచ్చే మార్పులతో వ్యాపించే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రం కారంచేడు పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి కే జెస్సీరాణి, డాక్టర్ సురేష్‌లు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఇచ్చారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అంటు వ్యాధులు, జ్వరాలు, జ్వరాలు, దగ్గు, జలుబులు, డెంగీ చికెన్‌గున్యా, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన అనేక విషయాలను వారు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి పవిత్రోత్సవాలకు అంకురార్పణ

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డులోని హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో వార్షిక పవిత్రోత్సవాల సందర్భంగా గురువారం నుంచి ఈ నెల 18 సోమవారం వరకు స్వామికి విశేష పూజలు హోమాలు, ఆభరణ సేవలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశ కేశవాచార్యులు తెలిపారు. గురువారం సాయంత్రం ఆరు గంటలకు మంగళ ధ్వని, స్వస్తివాచనం, ఆచార్య ప్రణామం, రాత్రి ఏడు గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహం, అఖండ దీపారాధన, రక్షాబంధనం, ఆచార్యుని ఋత్విగ్వరణం, మేదిని పూజ, అంకురారోహణ కార్యక్రమాన్ని కేశవాచార్యులు ఆధ్వర్యంలో అర్చక స్వాములు రంగాస్వామి, చక్రవర్తి సమీర్ కుమార్ వైభవంగా నిర్వహించారు. రాత్రి ఎనిమిది గంటలకు స్వామికి అర్చన, నివేదన, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు.

చేనేతలకు మేలు చేసింది సీఎం జగనే



చేనేత వృత్తులను పరిశీలించి మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీరాల టౌన్: చేనేత రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారని మండల పార్టీ అధ్యక్షుడు ఎ.అంకాళ‌రెడ్డి, అర్బన్ కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావులు అన్నారు. గురువారం మండలంలోని తోటవారిపాలెం–2 సచివాలయాల పరిధిలో, కొత్తపాలెం గ్రామ పంచాయితీలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనన్నే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. తోటవారిపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు చేనేత వృత్తులు, ఉపవృత్తులను పరిశీలించారు. చేనేతలకు ఎనలేని మేలు చేసేలా పథకాలు అందిస్తున్న సీఎం జగన్ సంక్షేమ పాలనను ప్రతి ఇంటికి వెళ్లి వివరించారు. గతంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను రూపొందించి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ద్వారా అందరికి పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించారన్నారు. చేనేతలకు నేతన్ననేస్తం పథకంలో ఏడాదికి రూ.24 వేలతో పాటుగా అమ్మఒడి, చేయూత, చేదోడు పథకాలను అందించి నేతన్నలకు అండగా నిలిచారన్నారు. మళ్లీ సీఎంగా చేసేందుకు అందరం సిద్ధంగా ఉన్నామన్నారు.

అనంతరం గ్రామంలో సంక్షేమ పథకాలు బ్రోచర్‌తో పాటుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ బి.సాంబశివరావు, జిల్లా పార్టీ కార్యదర్శి శివపార్వతి, జేసీఎస్ కన్వీనర్ బి.సాంబు, శ్రావణ్, నారాయణ, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, సుబ్బారావు, గిరీష్, శ్రీనివాసరెడ్డి, గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని పాదయాత్ర



మేదరమెట్ల చేరుకున్న పాదయాత్ర బృందం

జే.పంగులూరు/మేదరమెట్ల: జగన్ మళ్లీ సీఎం కావాలని వైఎస్సార్ అమరజ్యోతి స్టూడెంట్ యూత్ ఫోర్స్ విద్యార్థులు పాదయాత్ర చేస్తున్నారు. 'వన్స్ మోర్ రావాలి జగనన్న–కావాలి జగనన్న' కార్యక్రమంలో భాగంగా విశాఖ నుంచి తిరుపతికి పాదయాత్ర గురువారం మండల పరిధిలోని ముప్పవరం జాతీయ రహదారికి చేరుకుంది. ఈ సందర్భంగా సాక్షి ప్రతినిధి వారితో మాట్లాడగా అనకాపల్లి జిల్లా రావికమతం మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు వైఎస్సార్ అమరజ్యోతి స్టూడెంట్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. గత నెల 30వ తేదీన విశాఖ పట్నం నుంచి పాదయాత్ర ప్రారంభించినట్లు వారు తెలిపారు. ఇప్పటికి 660 కిలోమీటర్లు నడిచామన్నారు. గతంలో వైఎస్సార్ అమరజ్యోతి పాదయాత్ర పేరుతో గత 6 సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా విశాఖపట్నం నుంచి ఇడుపులపాయకు పాదయాత్ర చేసినట్లు తెలిపారు. వైఎస్సార్ ఫీజు రీయింబర్స్ మెంట్ లబ్ధిపొందిన స్ఫూర్తితో పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. ముప్పవరం గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు పూసల గంగాధర్ పాదయాత్ర చేస్తున్న వారిని అభినందించారు. ఈ పాదయాత్ర కార్యక్రమంలో బంగారు ప్రసాద్, ఎం ధర్మేంద్ర, మున్నా, సత్తిబాబు, స్వామినాయుడు, సత్తిబాబు, అప్పలనాయుడు పాల్గొన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామానికి చేరుకున్న వారిని వైఎస్సార్ సీపీ నాయకులు స్వాగతం పలికారు. రాత్రికి మేదరమెట్లలో బసచేసి శుక్రవారం తిరిగి పాదయాత్ర చేస్తామని వారు చెప్పారు.

పరస్పర సహకారంతోనే అభివృద్ధి



ఎస్ఎల్ గుడిపాడులో ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీలో పాల్గొన్న కో ఆర్డినేటర్, అధికారులు



కుంకలమర్రులో కిసాన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ లక్ష్మీనారాయణ

కారంచేడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఆయన 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమంలో భాగంగా కారంచేడు, కుంకలమర్రు గ్రామ పంచాయతీల వద్ద ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలతో పాటు ఆయుష్మాన్‌భారత్, పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, పీఎం విశ్వకర్మ, పీఎం కిసాన్‌కార్డు, పీఎం పోషణ్ అభియాన్ వంటి కొన్ని రకాల పథకాల ఉపయోగాలను ఆయన వివరించారు. అనంతరం కుంకలమర్రు పంచాయితీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలోను ఆయన పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు కిసాన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, డాక్టర్ సురేష్, ఐకేపీ ఏపీఎం మధుసూదనరావు, ఏపీఓ ఎన్ ప్రదీప్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హిమబిందు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధిహామీ పథకం సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బల్లికురవ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతోనే అర్హులందరికీ సంక్షేమ పథకాలతో గ్రామాలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని వికసిత్ భారత్ కో ఆర్డినేటర్ పోలవరపు అనుప్రసాద్ అన్నారు. గురువారం మండలం వైదన, ఎస్ఎల్ గుడిపాడు గ్రామాల్లో సంకల్పయాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 17 పథకాలపై డిజిటల్ స్క్రీన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఉజ్వల యోజన గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మేడా జయలక్ష్మీ, పసల అంజలి, ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య, రూట్ ఆఫీసర్ విజయ్ సెక్రటరీలు ప్రసాదరావు, ఎస్ సాయిబాబు, స్థానిక నేతలు మండల అధికారులు పాల్గొన్నారు.

తూకాల్లో తేడాలొస్తే చర్యలు తప్పవు



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న జాయింట్ కంట్రోలర్ మాధురి

వేటపాలెం: తూకాల్లో తేడాలు వచ్చినట్లు ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని తూనికలు, కొలతల జాయింట్ కంట్రోలర్ మాధురి హెచ్చరించారు. స్థానిక జీడిపప్పు ఫ్యాక్టరీల వద్ద జిల్లా తూనికల, కొలతల అధికారులు ఆకస్మిక తనిఖీలు గురువారం నిర్వహించారు. ఫ్యాక్టరీల వద్ద గల తూకాలకు పది సంవత్సరాల నుంచి రెన్యూవల్ చేయించుకోవడం లేదని గుర్తించారు. ప్యాకింగ్ లైసెన్స్‌లు పొందలేదని గుర్తించారు. ఈ సందర్భంగా జాయింట్ కంట్రోలర్ మాట్లాడుతూ తప్పనిసరిగా ప్రతి ఏడాది ఎలక్ట్రానిక్, సాధారణ కాటాలను పరీక్షింలు చేయించుకొని రెన్యూల్ పొందాల్సి ఉంటుందని తెలిపారు. అదే విధంగా ప్రతి ఫ్యాక్టరీ యజమాని ప్యాకింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. అనంతరం తూనికల, కొలతలపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కంట్రోలర్ ఇసాక్, అసిస్టెంట్ కంట్రోలర్ పి లిల్లీ, ఇన్‌స్పెక్టర్లు రాందాస్, కే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 29 టీడీపీ కుటుంబాల చేరిక



వైఎస్సార్ సీపీ పార్టీలోకి చేరిన బీసీ కాలనీ వాసులు

యద్దనపూడి: మండలంలోని యనమదల గ్రామంలో బీసీ కాలనీలో టీడీపీకి చెందిన 29 కుటుంబాలు వైఎస్సార్ సీపీలోకి చేరాయి. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలెపోగు రాంబాబు ఆధ్వర్యంలో 65 మంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆకరితులై పార్టీలో చేరారు. వీరిని రాంబాబు పార్టీకండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఐమాల శ్యాంసన్, గ్రామ సర్పంచ్ రాయి పృథ్వీరాజ్, ఎలిశెట్టి రామకృష్ణ, కుప్పాళ్ల కృష్ణయ్య, గుంజి నాగరాజు, తన్నీరు శ్రీను, గుంజి సుబ్బారావు, వల్లెపు శ్రీను, అంకమ్మ, బుల్లోడు, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ నష్టాలకు గ్రామస్థాయిలో బృందాలు



వల్లాపల్లిలో మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏవో కుమారి



చినగంజాం: పంట నష్టం నమోదు చేస్తున్న వ్యవసాయ బృందం

బల్లికురవ: ఇటీవల సంభవించిన మిచాంగ్ తుఫాన్‌కు పంటల నష్ట వివరాలను సేకరణకు గ్రామస్థాయిలో టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు వ్యవసాయాధికారి పీ. కుమారి గురువారం తెలిపారు. వల్లాపల్లి గ్రామంలో వాలిన మొక్కజొన్నను ఆమె పరిశీలించారు. 33 శాతం కంటే ఎక్కువ నష్టం జరిగితే వివరాలను సేకరించాలని టీమ్‌లను ఆదేశించారు.

నష్టం వివరాలను సేకరిస్తున్న వ్యవసాయ బృందం

చినగంజాం: తుఫాన్ కారణంగా మండలంలో నష్టపోయిన పంటలను గుర్తించి వివరాలను సేకరిస్తున్నట్లు వ్యవసాయాధికారి కే భాస్కరరావు తెలిపారు. వీఏఏ, గ్రామ రెవెన్యూ అధికారులతో సర్వే బృందాన్ని ఏర్పాటు చేసి నష్ట వివరాలు గుర్తిస్తున్నట్లు ఆయన వివరించారు. ఇప్పటి వరకు 300 ఎకరాలు మిరప, 80 ఎకరం శనగ, 20 పొగాకు నష్టపోయిన పంటన గుర్తించి, పంట నష్టం నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని పెదగంజాం, గొనసపూడి, సంతరావూరు, కడవకుదురు గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మేదరమెట్ల: పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చని, కాల్షియం ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తినడం అలవాటు చేసుకోవాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ అనిల్ కుమార్ అన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామం సోమవరప్పాడులో గల ఎంపీయూపీ స్కూల్ నందు విద్యార్థులకు స్థానిక వైద్యశాల డాక్టర్ చిట్టిబాబుతో కలసి గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులకు ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పించారు. చిన్నారుల్లో దంతాలకు సంబంధించిన ఫ్లోరోసిస్ వ్యాధి వస్తుందని, వాటి నివారణ కోసం రాగి, సిట్రస్ కలిగిన పండ్లను ఎక్కువగా తీసుకోవాలన్నారు. కాల్షియం ఎక్కువగా ఉండే పాలు, పెరుగు వంటి పదార్థాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో బ్రహ్మానందం, ఏఎన్‌ఎం అరుణ, ఆశలు పాల్గొన్నారు.

జీవాల పెంపకానికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు



గేదెలకు వైద్య పరీక్షలు చేస్తున్న పశువైద్యులు

చీరాల టౌన్: పాడి పశువుల పెంపకంలో, జీవాల ఆరోగ్యం పట్ల పశుపోషకులు జాగ్రత్తగా ఉండటం వలన జీవాలకు సీజనల్ వ్యాధులు దరిచేరవని చీరాల ఏడీహెచ్ డాక్టర్ సజ్జ చిట్టిబాబు, గవినివారిపాలెం పశువైద్యుడు డాక్టర్ టి.శివారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బుర్లవారిపాలెం గ్రామ పంచాయతీలో పశువైద్యశాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఉచిత శిబిరంలో 45 గొర్రెలు, 54 గేదెలు, 14 దూడలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 67 జీవాలకు నట్టల నివారణ మందులు అందజేశారు. ఈసందర్భంగా పశువైద్యులు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయం, పశువుల పెంపకం ముఖ్యమైనవని, పాడి పశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవడంతో పాటుగా క్రమం తప్పకుండా చూడి పరీక్షలు చేయించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా టీకాలు, పాల ఉత్పత్తి పెరిగేందుకు అవసరమైన దాణాలను, అనారోగ్యంతో ఉన్న జీవాలకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. పశుబీమా, పశుగ్రాస విత్తనాలు, మేలుజాతి దూడల పెంపకం వలన కలిగే ప్రయోజనాలను, ప్రభుత్వం అందిస్తున్న పలు రాయితీ పథకాలను గురించి పశుపోషకులకు వివరించారు. పాడి పరిశ్రమలో ఆర్థికంగా వృద్ధి సాధించే పలు సూచనలు, సలహాలు అందించారు. రైతులు, పశుపోషకులకు మేలు చేసేలా పాడిపంటల గురించి అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు, పశువైద్యశాల సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

మండుతున్న కూరగాయలు



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

- దెబ్బతీసిన మిచాంగ్ తుఫాన్
- రెండు నెలలు ఇదే పరిస్థితి అంటున్న వ్యాపారులు

వేటపాలెం: సహజంగా రబీ సీజన్‌లో రైతులు కూరగాయల పంటలు పండించి మార్కెట్‌కు తరలించే సమయం. అయితే మిచాంగ్ తుఫాన్ కారణంగా తమిళనాడుతో పాటు, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపింది. తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు కూరగాయల పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. కూరగాయల పంటల దిగుబడులు లేకపోవడంతో దాని ప్రభావం మార్కెట్‌పై పడింది. దీంతో కాయగూరలు కొనాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ప్రస్తుతం కొన్ని రకాల కూరగాలయలు ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. తమిళనాడు, చిత్తూరు, నెల్లూరు మార్కెట్‌కు చెందిన వ్యాపారులు విజయవాడకు వచ్చిన కూరగాయలు హోల్ సేల్ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. వచ్చిన కొద్దిపాటి దిగుబడులకు డిమాండ్ పెరిగిపోయింది. మూడు నెలల కిందట మంట పుట్టించిన టమెటా మినహా అన్ని కూరగాయలు ధరలు భారీగా పెగాయి. తిరిగి కూరగాయల పంటలు దిగుబడులు రావాలంటే రెండు నెలల వ్యవధ పడుతుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

> **కాయగూరలు కొనలేకపోతున్నాం..**
> మిచాంగ్ తుఫాన్ రాకముందు కూరగాయల ధరలు అంతగా ఉండేవి కావు. కావాల్సినవన్ని కొని సంతోషంగా తిన్నాం. కాని తుఫాన్ రావడంతో కాయగూరల ధరలు విపరీతంగా పెరిగియాయి. దీంతో సంతోషం కొన్నిరోజులు మాత్రమే ఉంది. ప్రస్తుతం కాయకూరల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి కొనలేకపోతున్నాం. ప్రస్తుతం కొద్దికొద్దిగా కూరలు కొని కాలం వెళ్లదీస్తుదీన్నాం.
> – డీ వసుంధరదేవి, వేటపాలెం

ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో, రూపాయల్లో
పచ్చి మిర్చి	60
బీరకాయలు	100
కాకరకాయలు	80
టమోటా	40
క్యారెట్	80
వంకాయలు	120
బెండకాయలు	80
ఆలుగడ్డ	70
బీట్‌రూట్	70
క్యాలీఫ్లవర్ (ఒకటి పువ్వు)	60
క్యాబేజీ	70
చేమ దుంపలు	60
దోసకాయలు	70
తోటకూర (కట్ట)	20
గోంగూర (కట్ట)	20
పచ్చి అరటి కాయలు (డజను)	50
క్యాప్సికం	100

భక్తిశ్రద్ధలతో జీవధ్వజ స్తంభ నగరోత్సవం



ట్రాక్టర్‌పై ధ్వజ స్తంభాన్ని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ

చీరాల అర్బన్: కొత్తపేట ఐఎల్‌టీడీ కాలనీలో వేంచేసియున్న ఓంకారక్షేత్రంలో ఆదివారం నిర్వహించనున్న జీవధ్వజ స్తంభ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా గురువారం గ్రామంలో నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. నూతనంగా ప్రతిష్ఠించనున్న జీవధ్వజ స్తంభాన్ని వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించి ట్రాక్టర్‌పై గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. నగరోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆదివారం జరిగే ప్రతిష్ట మహోత్సవానికి వాడరేవు శ్రీరామానంద సరస్వతి స్వామీజీ హాజరవుతున్నారని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కమిటీ ప్రతినిధులు సూచించారు. కార్యక్రమంలో టి.సత్యనారాయణ, రామకృష్ణశర్మ, రమణ, తిరుమల, కృష్ణ, కోటేశ్వరరావు, నరేంద్ర, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారుల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న వైస్ చైర్మన్ జైసన్‌బాబు

చీరాల అర్బన్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు అందరికి అందుతున్నాయని మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు అన్నారు. గురువారం పట్టణంలోని క్లస్టర్–2 వీరరాఘవపేట సచివాలయం పరిధిలో పార్టీ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ సూచనలతో ఆంధ్రప్రదేశ్‌కి జగనన్న ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఇప్పటి వరకు సచివాలయ పరిధిలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. వైస్ చైర్మన్ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలో ఎంతో మంది లబ్ధి పొందారన్నారు. రాష్ట్రంలో అందరికి సంక్షేమ పథకాలు ఇలానే కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ–2 అధ్యక్షులు గుంటూరు మాధవరావు, కౌన్సిలర్లు మామిడాల రాములు, తోకల అనిల్, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, మెప్మా సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.